క్లుప్తంగా

వైభవంగా శివ, పార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో శివ, పార్వతులు

పెద్దతిప్పసముద్రం : స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివ, పార్వతుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శివాలయం సేవకులు ససగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆరుద్ర నక్షత్రం , శివుని జన్మ నక్షత్రం సందర్భంగా వేద పండితులు శివ, పార్వతుల ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

1644 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు



వేరుశనగ కాయలు పరిశీలిస్తున్న ఏవో రమాదేవి

పీలేరు రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు మండలానికి 1644 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారి రమాదేవి తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయానికి చేరిన వేరుశనగ విత్తన కాయలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీ పోనూ కే6 రకం 30 కేజీల బ్యాగు రూ.1674, నారాయణి రకం 30 కేజీలు బ్యాగు రూ.1710 చెల్లించి తీసుకోవచ్చని తెలిపారు. త్వరలో రైతులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మదనపల్లికి చెందిన లయన్స్ క్లబ్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 75 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 15 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. మండల జెడ్పీటీసీ ఉంగరాల శివన్న, స్థానిక సర్పంచ్ రహ్మతుల్లా, ఎంపీటీసీ కేశవలు శిబిరంలో పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువసేన నాయకులు

మదనపల్లె : స్థానిక వారపుసంతలో అక్రమంగా నిర్మించిన గోదాములు, షెడ్లను తొలగించాలని కోరుతూ బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ కమిషనర్ కె.ప్రమీలకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే స్థలంలో దళారులు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. నిబంధనల మేరకు వారపుసంతలో పక్కా నిర్మాణాలకు అనుమతి ఉండదని, అలాంటప్పుడు నిర్మాణాలు ఎలా చేశారని ప్రశ్నించారు. వీటికి విద్యుత్‌శాఖ మీటర్లు కూడా ఇచ్చిందని పేర్కొన్నారు. కొన్ని షెడ్లను అద్దెలకు ఇచ్చుకొంటూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వీలైన స్థలంలో జరిగిన ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రమీల చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, హరికృష్ణ, శశికుమార్, నిజాం బాషా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

పెనగలూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లి పంచాయతీలో గురువారం జరిగిన గంగమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జాతరలో రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండాలని గంగమ్మను కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి సానారెడ్డి, లేబాకు వెంకటరెడ్డి, కామనూరు వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగ సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినోదం

- గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం
- విద్యార్థుల్లో నూతనోత్తేజం
- సెలవులు సద్వినియోగం



విద్యార్థులకు బోధన చేస్తున్న విశ్రాంత అధ్యాపకుడు రెడ్డప్ప

మదనపల్లె సిటీ : ఏడాదంతా చదువులు, పరీక్షల్లో నిమగ్నమైన విద్యార్థులు వేసవి సెలవులనగానే ఎగిరి గంతేస్తారు. ఆటలు, వినోదానికే మొత్తం సమయం కేటాయిస్తారు. అయితే వేసవిలో వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించేలా ఏర్పాటు చేసినవే వేసవి విజ్ఞాన శిబిరాలు. పరీక్షల అనంతరం విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు.. మదనపల్లె శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పేరుతో పౌర గ్రంథాలయ శాఖ 40 రోజుల క్యాంపులు నిర్వహిస్తోంది. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరంలో పలు అంశాలపై చిన్నారులకు శిక్షణ ఇస్తోంది. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ప్రధానంగా విశాంత్ర అధ్యాపకులు రెడ్డప్ప స్పోకెన్ ఇంగ్లిషు, మదన్‌మోహన్ మోటివేషన్ క్లాసులు, చంద్రకళ డ్రాయింగ్, న్యూట్రిషియన్, యోగా, క్రిష్ణమూర్తి మ్యాథ్స్, ప్రసాద్‌శర్మ తెలుగు పాఠాలు బోధిస్తున్నారు. ఈ శిబిరానికి సుమారు వంద మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు.

నైపుణ్యాభివృద్ధి.. సృజనాత్మక శక్తి

విద్యార్థుల్లో నేర్చుకోవడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలతోపాటు సృజనాత్మకతను పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కథలు వినిపించడం ద్వారా శ్రవణం, పుస్తకాలు చదివించడం ద్వారా పఠనం, కథలు చెప్పడం ద్వారా మాట్లాడటం, జ్ఞాపకశక్తి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌తోపాటు వారి సమగ్రాభివృద్ధికి బాటలు వేసే వివిధ అంశాలు నేర్పిస్తున్నారు. కళలపై ఆసక్తి పెంచేలా డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, బొమ్మల తయారీ వంటివి శిక్షణ ఇస్తున్నారు.

విశేష స్పందన



వేసవి విజ్ఞాన శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా వస్తున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆటవిడుపుగా డ్యాన్స్, యోగా వంటి నేర్పిస్తున్నాం.

- వసంతకుమారి, గ్రంథాలయాధికారి, మదనపల్లె

రోజూ రావాలని ఉంది



సెలవుల్లో గ్రంథాలయానికి వస్తున్నా. ఇక్కడ చెబుతున్న కథలు బాగుంటున్నాయి. తెలుగు సార్ తెలుగు కవులు, పద్యాలు, కథలు చెబుతున్నారు. ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. చాలా విషయాలు తెలుసుకుంటున్నా.

- హాసిని, తొమ్మిదో తరగతి, మదనపల్లె

ఎన్నో నేర్చుకుంటున్నాం



వేసవి శిబిరానికి ప్రతి ఏడాది వస్తున్నా. స్పోకెన్ ఇంగ్లిషు, యోగా, డ్యాన్స్ నాకు బాగా నచ్చాయి. దీనివల్ల ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నా. తరగతులకు వచ్చే సార్లు బాగా చెబుతున్నారు. నాతోపాటు వచ్చే స్నేహితులతో సరదాగా గడుపుతున్నా.

- తనుషా, ఆరవ తరగతి, మదనపల్లె

వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కలకడ/కలికిరి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే మహిళా అభివృద్ధి సాధ్యమైందని, అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట వేసి ప్రోత్సహించిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం వాల్మీకిపురంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో కలకడ మండల వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు గుడిటి సరళ తనకు పార్టీ గుర్తింపు ఇచ్చినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మహిళల్లో ఐక్యతకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కలగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆశలు ఆవిరి అయ్యే విధంగా వాయిదాల పద్ధతి అవలంబిస్తుందన్నారు. అన్నివర్గాలకు అన్యాయమే జరుగుతోందన్నారు. కక్షసాధింపులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సాగుతోందని, ఇది ఎంతోకాలం సాగదని అన్నారు. పార్టీ పరంగా అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పుంగునూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు.

పార్టీ పదవులు పొందిన వారు మాజీ ఎమ్మెల్యేకి సన్మానం

కలకడ మండల మహిళా అధ్యక్షురాలిగా ఎంపికైన కోన గ్రామానికి చెందిన గుడిటి సరళ, కలికిరి మండలానికి చెందిన రైతు విభాగం అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు చింతపర్తి ఓబుల్‌రెడ్డిలు వారికి పదవిని కేటాయించినందుకు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి, మాజీ మంత్రి పుంగునూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని శాలువ, పూలమాలతో సత్కరించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండల కన్వీనర్ చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, కంభం మహేంద్రరెడ్డి, శామ్యూల్, యుగందర్, మున్నా, ముభారక్, తాజుద్దీన్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

1న హామీల అమలు కోసం ధర్నా

బి.కొత్తకోట : అధికారంలోకి వచ్చేందుకు కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 1వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పీటీఎం రోడ్డు వద్ద ధర్నా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల మంజూరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అష్రఫ్ వల్లీ, తంబయ్యశెట్టి, వెంకటరమణ, బావాజాన్, నసరింహులు, నారాయణస్వామి, హబీబ్, షఫీ, బాబు పాల్గొన్నారు.

31న జాబ్ మేళా

రాయచోటి టౌన్ : ఈ నెల 31వ తేదీ అన్నమయ్య జిల్లా కేంద్రంలోని మొలకలచెరువులోని బ్లాసమ్ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు అన్నమయ్య జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు ఐటీఐ డిప్లమా పూర్తి చేసిన 18 – 30 సంవత్సరాల యువతీయువకులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మేళాలో ఎంపికై న వారికి వేతనం రూ.16 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు

చిట్వేలి : చిట్వేలిలోని పురాతన శ్రీ వరదరాజు స్వామి, శ్రీ వీరభద్రస్వామి ఆలయాలను గురువారం దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, రాజంపేట సమూహ దేవాలయాల అధికారి కొండారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్యలు సందర్శించారు. వరదరాజ స్వామి ఆలయానికి సంబంధించి సర్వే నెంబరు. 383లో 83 సెంట్లు ఖాళీ స్థలాన్ని, అలాగే శ్రీ భద్రకాళి శ్రీ వీరభద్రుడు స్వామి వారి ఆలయాలలోని సర్వే నెంబరు. 165లో 2.28 ఎకరాల భూమిలో ఉన్న 60 మామిడి చెట్లను సందర్శించారు. సదరు మామిడి చెట్లకు సంబంధించి ఫలసాయాన్ని గుత్తకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సర్వేయర్‌ను కలిసి భూములకు సంబంధించి హద్దులు గుర్తించామని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి, ఆలయ అర్చకులు అరవింద స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటకరంగం ఎంతో గొప్పది

రాజంపేట టౌన్ : నాటకరంగం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జీఎంసీ కళామందిర్‌లో బుధవారం రాత్రి ప్రముఖ కళాకారులుగా రాణించిన దివంగత వేంపల్లె బాషా, మూలపల్లె రామయ్య, చంద్ర ఓబులపతి, పల్లేటి లక్ష్మీకులశేఖర్, వెంకట నరసరాజు జ్ఞాపకార్థంగా శ్రీ అన్నమాచార్య, మణికంఠ కళాకారుల ఐక్యవేదిక బృందం ఆధ్వర్యంలో ఉచిత పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సెల్‌ఫోన్ విప్లవంలో నాటకరంగం అంతరించిపోతున్న తరుణంలో రాజంపేటకు చెందిన అనేక మంది కళాకారులు నాటకరంగాన్ని బతికించుకునేందుకు కృషి చేస్తుండటం అభినందనీయమని తెలిపారు. కాగా తొలుత మృతి చెందిన కళాకారుల ఆత్మశాంతి కోసం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు కళాకారులు, ప్రేక్షకులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగా శేఖర్‌రెడ్డి, ప్రముఖ కళాకారులు గుండ్లూరు సుబ్బరాయుడు, సంద్రపల్లి కృష్ణయ్య, బి.పెద్దరెడ్డయ్య, యు.రామచంద్రారెడ్డి, వి.సుబ్బరాజు, రమణశ్రీ, మారోతు గంగయ్యనాయుడు, విజయలక్ష్మి, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని వివిధ మండలాలకు పార్టీ కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

బి.కొత్తకోట మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా దేవేంద్రరెడ్డి, ఎస్.రవికుమార్, ప్రధాన కార్యదర్శులుగా సుబ్బారెడ్డి, ఎం.ఆదిశేఖర్ రెడ్డి, శేఖర, వై.భయ్యారెడ్డి, కార్యదర్శులుగా ఎం.భాస్కర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, ఎం.నరసింహారెడ్డి, విజయారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎస్.బావాజీ, శివన్న, ఎ.హరినాథరెడ్డి, కె.యల్లప్ప, ఎ.చంద్రయ్య, బి.చిదంబరంరెడ్డి, పి.నరసింహారెడ్డి, ఆర్.శివారెడ్డిలను నియమించారు.

ములకలచెరువు మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా టి.శ్రీనివాసులు, ఎస్.ఫకృద్దీన్, ప్రధాన కార్యదర్శులుగా డి.హనుమంతరెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి, ఎం.నరసింహులునాయుడు, ఎం.సుబ్బిరెడ్డి, కార్యదర్శులుగా పి.నాగరాజ, ఆర్.రామకృష్ణ, బి.హైదర్‌వలీ, అన్సర్ బాషా, శేఖర్, రమేష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.మద్దిరెడ్డి, ఉపేంద్ర, శంకర, చలపతి, అనిల్, వై.కృష్ణప్ప, సుధాకర్‌రెడ్డి, ఎం.నాగరాజు, జి.మహబూబ్ బాషాను నియమించారు.

పెద్దతిప్పసముద్రం మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఎస్.రవిశంకర్, ఏకే కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రామచంద్ర, ఎ.అశోక్‌రెడ్డి, వెంకటరెడ్డి, జి.సుధాకర్, కార్యదర్శులుగా ఎ.రామకృష్ణస్వామి, కె.శ్రీనివాసులు, కె.నారాయణ, పి.రాజశేఖర్, ఆర్.ఉత్తమరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.వెంకట నారాయణ, టీఆర్ శ్రీనివాసులు, బి.నాగరాజారెడ్డి, ఎస్.బాబారెడ్డి, డి.నాగరాజు, డి.అయ్యుబ్‌ఖాన్, జి.రాధాకృష్ణ, ఎస్.రమేష్, కె.వెంకట రమణ, ఎస్.సోమశేఖర్‌రెడ్డి, బి.వెంకట రమణ, జి.రవి, ఎస్.కృష్ణారెడ్డి, జె.సాధిక్‌బాషాను నియమించారు.

మదనపల్లి జిల్లా హామీ ఏమైంది?

రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి



కలికిరి : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లి జిల్లాగా ప్రకటిస్తామన్న హామీ ఏమైందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే గాలికి వదిలేసిన చంద్రబాబు, మదనపల్లి ప్రజలకు ఇచ్చిన హామీని కూడా గాలికి వదిలేశారని విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతో పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు చూపుతున్న శ్రద్ధ.. మదనపల్లి జిల్లాను ప్రకటించడంలో లేకపోవడం శోచనీయమన్నారు. మదనపల్లి వాసులకు చంద్రబాబు, యువగళంలో లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు తగిన రీతిలో బుద్ధిచెబుతారన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ వైవీ రమణరావు

కేవీపల్లె : వ్యవసాయం చేయడంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని పీలేరు ఏడీఏ వైవి. రమణరావు అన్నారు. గురువారం మండలంలోని చిన్నకమ్మపల్లెలో వికసిత్ కృషీ సంకల్ప అభియాన్ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ కృషీ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం క్షేత్ర స్థాయిలో ఖరీఫ్‌లో రైతులు పాటించాల్సిన సాగు పద్ధతులు, నూతన సాంకేతికత తదితర అంశాలు అవగాహన కల్పిస్తారని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఉద్యానశాఖ అధికారి టి. సుకుమార్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ కె.హేమనారాయణరెడ్డి, శాస్త్రవేత్తలు మాధురి, ఎ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలి
- కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యం ఖూనీ
- సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె రూరల్ : మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి వారితో చర్చలు జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మాడ్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజుతో పాటు 27మంది నక్సలైట్లను కేంద్ర ప్రభుత్వ పోలీసు బలగాలు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం తన క్రూరమైన వైఖరిని మార్చుకొని మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలు జరపాలంటూ అనేక సార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నపాలు చేసినా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కారాన్ని కనుగొనే మార్గాన్ని వదిలేసి, హింసతో కూడిన విధానాన్ని అనుసరిస్తోందని, ఇవి ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ హత్యలేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపకపోవడానికి ప్రధాన కారణం ఛత్తీస్‌గఢ్ అడవుల్లో 46 రకాల ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వీటిని ఇప్పటికే అదానీ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆదివాసీల నుంచి అదానీ కంపెనీకి రక్షణ కల్పించేందుకు ఆపరేషన్ కగార్ కొనసాగిస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కొక్కటిగా కార్పొరేట్ పరం చేశారన్నారు. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదపై కన్నేసి కార్పొరేట్లకు అటవీభూములు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ కొనసాగిస్తోందన్నారు. శత్రుదేశాలతో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకున్నప్పుడు, మావోయిస్టులతో శాంతి చర్చలు నిరాకరించడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో శాంతి సంఘీభావం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జీవీ శివకుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, సూరి, దేవ, తిరుమల, ముబారక్, మస్తాన్, చలపతినాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కేంద్రం, సబ్‌స్టేషన్లు మంజూరు



డిస్కం ఈఈ గంగాధర్

మదనపల్లె : తంబళ్లపల్లె నియోజకవర్గానికి కొత్తగా విద్యుత్ కేంద్రం, సబ్‌స్టేషన్లు మంజూరైనట్టు డిస్కం మదనపల్లె ఈఈ ఎం.గంగాధర్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలంలో అంగళ్లు–కంటేవారిపల్లె మధ్యలో రూ.60 కోట్ల వ్యయంతో 132 విద్యుత్ కేంద్ర నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. పెద్దతిప్పసముద్రం మండలం రామాపురం, ములకలచెరువు మండలం సొంపల్లెలో 33/11 సబ్‌స్టేషన్లు మంజూరవగా, రూ.4 కోట్లతో పనులు చేస్తారని చెప్పారు. పెద్దమండ్యం మండలం బండివారిపల్లె–ముసలికుంట మధ్య 10 కిలోమీటర్లు 33 కేవీ విద్యుత్‌లైన్ పనులు ఆర్డీఎస్ఎస్ పథకం కింద జరుగుతున్నాయని పేర్కొన్నారు. కంటేవారిపల్లె సబ్‌స్టేషన్‌లో రూ.70 లక్షల వ్యయంతో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కోసువారిపల్లె, ముదివేడు, తంబళ్లపల్లె, కలిచర్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.50 నుంచి రూ.70 లక్షల వ్యయం అవుతుందని వివరించారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తత అవసరం



హెచ్‌ఐవీపై కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

పీలేరు : హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోర్ సంస్థ ఓఆర్‌డబ్ల్యూ రాజమ్మ అన్నారు. గురువారం ఇందిరమ్మ కాలనీలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేసీ నటరాజ్ కళాబృందం కళాజాత ద్వారా హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ, క్షయవ్యాధి సంబంధం, సుఖవ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగంపై వివరించారు. హెచ్‌ఐవీ /ఎయిడ్స్ యాక్టు 2017పై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో శైలజ, పీఈలు మల్లీశ్వరి, మునీశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవాలి

- ప్రజలందరి ఐక్యతతోనే ఉగ్రవాదం అంతం సాధ్యం
- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె రూరల్ : కులమతాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచిన ప్రజల ఐక్యతా స్ఫూర్తిని రానున్న కాలంలోనూ కొనసాగించాలని, దేశంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకించాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు.

పహల్గాం దాడి అనంతరం పాక్‌పై యుద్ధం, అమెరికా ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సమైక్యతా యాత్ర పేరుతో కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక రింగ్‌రోడ్డు నుంచి నీరుగట్టువారిపల్లె, రామారావుకాలనీ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాదుల నుంచి పర్యాటకుల్ని రక్షించడంలో కశ్మీర్ ప్రజలు మతాలకు అతీతంగా ఉన్నారన్నారు. అయితే ఈ దాడిని అడ్డుపెట్టుకుని దేశంలోని కొన్ని శక్తులు ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే యత్నం చేస్తున్నారన్నారు. అమెరికా తన ఆధిపత్యం కోసమే పాక్‌పై భారత్ యుద్ధంలో జోక్యం చేసుకుందని, అమెరికాకు మోదీ లొంగిపోవడం సరికాదని విమర్శించారు. భారతదేశంపై ఇతర దేశాల పెత్తనం దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం అన్నారు. పహల్గాం దాడి తర్వాత బీజేపీ మంత్రులు ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసే యత్నం చేశారన్నారు. కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరి అని అభివర్ణించడం తీవ్ర అభ్యంతరకరమని, అయినా ఆయా మంత్రులపై బీజేపీ చర్యలు తీసుకోలేదని, ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా ఉగ్రవాదమేనని విమర్శించారు. బీజేపీ ఇటీవల చేసిన తిరంగా యాత్ర దేశ సమైక్యతను సూచించే విధంగా కాకుండా, ప్రజల మధ్య విద్వేషాలు పెంచే విధంగా ఉందన్నారు. దేశంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు ఇతర అన్ని మతాలు ఐక్యంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచారన్నారు. ఉగ్రవాదానికి మతం లేదనేది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.నరసింహ, పి.నాగరాజు, జి.రమణ, కె.చిన్నికృష్ణ, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల్లో సరుకులు పునఃప్రారంభం



ప్రభుత్వ చౌకదుకాణం తనిఖీ చేస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని రేషన్‌షాపుల్లో జూన్ 1 నుంచి నిత్యావసర సరుకులు పునఃప్రారంభం చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.భీమేశ్వర్‌రావు అన్నారు. గురువారం పీలేరు పట్టణంలో ప్రభుత్వ చౌకణాల నంబర్లు 7, 54, 55లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ అన్ని చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 65 సంవత్సరాలు పైబడి, అంగవైకల్యం కలిగిన లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు డీలర్లు పంపిణీ చేయాలన్నారు. మండలంలో 56 ప్రభుత్వ చౌక దుకాణాలు, 21,614 రేషన్‌కార్డులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ డీటీ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని ప్రతిఘటించి, మతసామరస్యాన్ని కాపాడుదాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పీలేరు : ఉగ్రవాదాన్ని ప్రతిఘటించి, మతసామరస్యాన్ని కాపాడుదామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరామయ్య, వెంకటాద్రి అన్నారు. గురువారం పీలేరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోరుతూ సమైక్యతా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై దాడి అనంతరం ఉగ్రదాడిని ఖండించడంలో దేశ ప్రజలు ప్రదర్శించిన ఐక్యత, సమైక్యతా స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్కతాటిపై నిలిపిందని తెలిపారు. అయితే కొందరు నాయకులు మతాలు వేరు చేసి మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు షాకీర్, రియాజ్, మహమ్మదాలి తదితరులు పాల్గొన్నారు.